సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

గురువారం । 29 । జూన్ । 2023



టన్ను చీనీ రూ.23 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం టన్ను చీనీకాయలు గరిష్ట ధర రూ.23 వేలు పలికాయి.



పరుగుల రాణి ప్రత్యూష

బుక్కపట్నం మండలం పాముదుర్తికి చెందిన ప్రత్యూష అథ్లెటిక్స్‌లో రాణిస్తోంది. పోటీలో దిగితే కచ్చితంగా పతకం సాధిస్తోంది. 8లో

గరిష్టం/కనిష్టం
35.4°/21.6°

జిల్లా అంతటా బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం స్వల్పంగా పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఒకట్రెండు చోట్ల తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 8 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

మున్సిపల్ కమిషనర్లకు అవగాహన



కమిషనర్లకు అవగాహన కల్పిస్తున్న డైరెక్టర్ ఆఫ్ స్టేట్ ఆడిట్ ఆర్.హరిప్రకాష్

కదిరి టౌన్: సీఎఫ్‌ఎంఎస్‌లో కొత్తగా ప్రవేశపెట్టిన ఆన్‌లైన్ ప్రీ ఆడిట్ సిస్టమ్‌పై ఉమ్మడి అనంతపురం జిల్లా కమిషనర్లకు అవగాహన కల్పించారు. పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో డైరెక్టర్ ఆఫ్ స్టేట్ ఆడిట్ ఆర్.హరిప్రకాష్ బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ పీవీవీఎస్ మూర్తి, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

104 సేవల్లో నిర్లక్ష్యం వద్దు

- డీఎంహెచ్‌ఓ కృష్ణారెడ్డి



కంబాలపల్లిలో 104 సేవలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ కృష్ణారెడ్డి

చిలమత్తూరు: గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే 104 సేవల్లో నిర్లక్ష్యం వహించకూడదని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కృష్ణారెడ్డి వైద్య సిబ్బందికి సూచించారు. బుధవారం మండలంలోని కంబాలపల్లిలో 104 సేవలను ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను తనిఖీ చేశారు. కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఆరోగ్య కార్యకర్తలు తమ పరిధిలోని గర్భిణులను గుర్తించడం, ఏబీహెచ్‌ఏ ఐడీలు, ఈ– ఆషా, ఏఎంబీ, ఎన్‌ఎస్‌డీసీడీ ఐడీలను పొందుపర్చడం, వ్యాధి నిరోధక టీకాలు వంటి వాటిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అనంతరం గ్రామంలో పర్యటించిన ఆయన ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ ద్వారా అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో వైద్యాధికారి రామకృష్ణ, డాక్టర్ హర్ష, సీహెచ్‌ఓ జయచంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు..

అప్రమత్తతతోనే రైలు ప్రమాదాలకు అడ్డుకట్ట



సేఫ్టీ సెమినార్‌లో ఇంజినీరింగ్ సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఆర్‌ఎం వెంకటరమణారెడ్డి

గుంతకల్లు: విధి నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరించడం ద్వారా రైలు ప్రమాదాలకు అడ్డుకట్ట వేయొచ్చని డీఆర్‌ఎం కె.వెంకటరమణారెడ్డి సూచించారు. వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బుధవారం గుంతకల్లులోని రైల్వే క్లబ్‌లో సేఫ్టీ సెమినార్ నిర్వహించారు. రైల్వే డివిజనల్ మేనేజర్ (డీఆర్‌ఎం) కె.వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ డివిజన్ వ్యాప్తంగా డ్యామ్, చెరువులు, కాలవలు, వంతెనల సమీపంలో రైలుమార్గం నిర్వహణ స్థితిపై దృష్టి సారించాలన్నారు. ఆయా ప్రాంతాల్లో 24 గంటలూ పర్యవేక్షించడానికి సిబ్బందిని కేటాయిస్తామన్నారు. వాటర్‌వేలను శుభ్రపరచుకోవడం ద్వారా ట్రాక్‌లపై వరదలు రాకుండా, రైళ్లు సాఫీగా నడిచేలా చూసుకోవాలని సూచించారు. అనుకోని ఘటనలు జరిగినప్పుడు అవసరమైన పనిముట్లను సిద్ధం ఉంచుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం సూర్యనారాయణ, ఇంజినీరింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

పుట్టపర్తి టౌన్: గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతీ యువకులకు సిడాప్, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఏపీఎం లక్ష్మీనారాయణ, జాబ్ కోర్డినేటర్ ఆంజనేయులు తెలిపారు. ఈమేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏదైనా డిగ్రీ 60 శాతం మార్కులతో పాసైన నిరుద్యోగ యువతీ యువకులకు సిల్క్ కాలేజ్ విజయవాడ భవానిపురంలో మూడు నెలల పాటు అన్ని సౌకర్యాలు కల్పించడంతో పాటు వేర్‌హౌస్ సూపర్ వైజర్ కోర్స్, కంప్యూటర్ నాలెడ్జ్, స్పోకెన్ ఇంగ్లిష్, జర్మన్ లాంగ్వేజ్‌పై ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. 20 నుంచి 34 సంవత్సరాల్లోపు వయసున్న వారు అర్హులన్నారు. విద్యార్హత సర్టిఫికెట్లతో పాటు ఆధార్‌కార్డు, పాస్ ఫొటోలతో పుట్టపర్తి వైకేపీ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు 9640899337 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

భవితకు భరోసా అమ్మఒడి



హాజరైన విద్యార్థులు, తల్లులు



లబ్ధిదారులకు మెగా చెక్కు అందజేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు



- జిల్లాలోని 1,60,397 మందికి లబ్ధి
- లబ్ధిదారుల ఖాతాల్లోకి రూ.208.516 కోట్లు
- హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు
- బాగా చదివి ఉన్నతస్థాయికి చేరుకోవాలన్న కలెక్టర్ అరుణ్‌బాబు

జిల్లాలోని లబ్ధిదారులు

నియోజకవర్గం	లబ్ధిదారులు	నగదు మొత్తం (రూ.)
ధర్మవరం	28,374	36,88,62,000
హిందూపురం	25,160	32,70,80,000
కదిరి	27,913	36,28,69,000
మడకశిర	21,710	28,22,30,000
పెనుకొండ	25,367	32,97,71,000
పుట్టపర్తి	21,503	27,95,39,000
రాప్తాడు	10,370	13,48,10,000
మొత్తం	1,60,397	208,51,61,000

పుట్టపర్తి అర్బన్: 'చదువుకు పేదరికం అడ్డు కాకూడదనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్ ఆధ్వర్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జగనన్న అమ్మఒడి పథకాన్ని అమలు చేస్తోంది... పేద విద్యార్థులకు భరోసా అమ్మఒడి.. ప్రతి విద్యార్థి బాగా చదువుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలి.' అని కలెక్టర్ అరుణ్‌బాబు పేర్కొన్నారు. బుధవారం పుట్టపర్తి కలెక్టరేట్‌లో జిల్లా అగ్రి అడ్వయిజరీ బోర్డు చైర్మన్ అవుటాల రమణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, ఇన్‌చార్జి డీఈఓ రంగస్వామితో కలిసి లబ్ధిదారులకు మెగా చెక్కు అందజేశారు. పార్వతీపురం మన్యం జిల్లా కురుపాంలో అమ్మఒడి పథకం కింద 4వ ఏడాది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి నగదు మొత్తాన్ని విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి జమ చేశారు. అక్కడ కార్యక్రమం పూర్తి కాగానే కలెక్టరేట్‌లో జిల్లాలోని అర్హులైన 1,60,397 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి రూ.208.516 కోట్ల నగదుకు సంబంధించిన మెగా చెక్కును అధికారులు అందజేశారు.

అర్హతే ప్రామాణికంగా...

కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ పేదల కుటుంబాల్లోని పిల్లల చదువుకు ఏ ఇబ్బంది ఉండకూడదనే అమ్మఒడి కింద డబ్బు జమ చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు అమ్మఒడితో పాటు పుస్తకాలు, బ్యాగులు, షూ, టై, నోట్ పుస్తకాలు, 8వ తరగతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్ నిక్షిప్తమైన ట్యాబ్‌లు అందజేస్తున్నట్లు చెప్పారు. కార్పొరేట్ పాఠశాలల కన్నా మిన్నగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. స్కూళ్లో మరుగుదొడ్లు, బెంచ్‌లు, మంచి నీళ్లు ఏర్పాటు చేశారన్నారు. రోజుకో రకమైన మెనూతో మధ్యాహ్న భోజనాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు. గుర్తింపు పొందిన అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, ఇంటర్ కళాశాలల్లోని విద్యార్థులకు రూ.13 వేలు అందజేస్తున్నారన్నారు. కుల, మతాలు, పార్టీలకు, ప్రాంతాలు తేడా లేకుండా అర్హులైన అందరికీ ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం అందజేసే ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకొని ప్రతి విద్యార్థి ఉన్నత చదువులు చదవాలని ఆకాంక్షించారు.

ప్రతి విద్యార్థీ బడికి....

జిల్లా అగ్రి అడ్వయిజరీ బోర్డు చైర్మన్ అవుటాల రమణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి మాట్లాడుతూ గతంలో అమ్మఒడి లాంటి పథకాలు ఏవీ లేవన్నారు. అందువల్లే వేలాది మంది విద్యార్థులు బాల కార్మికులుగా, డ్రాపౌట్లుగా మిగిలిపోతుండే వారని చెప్పారు. అన్నింటినీ గమనించిన సీఎం జగనన్న అమ్మఒడితో విద్యార్థులందరినీ బడికి పంపేలా చర్యలు తీసుకున్నారని హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ప్రభుత్వ బడుల్లో చదువుతున్న విద్యార్థులకు రాష్ట్ర, జిల్లా స్థాయి ర్యాంకులు వస్తున్నాయని తెలిపారు.

చాలా సంతోషంగా ఉంది



నాలుగేళ్లుగా నాకు అమ్మఒడి వస్తోంది. చాలా సంతోషంగా ఉంది. ఉన్నత చదువులకు ఉపయోగపడే ఎన్నో పుస్తకాలను కొనుగోలు చేశాను. ఉన్నత విద్యను అభ్యసించి మరికొంత మందికి ఆదర్శంగా ఉండాలనుకుంటున్నాను. ఈ సంవత్సరం పదిలో మంచి ర్యాంకు సాధిస్తా. సీఎం వైఎస్ జగన్‌కు మా కుటుంబం జీవితాంతం రుణపడి ఉంటుంది. **– శశికళ, 10వ తరగతి విద్యార్థిని, కదిరి**

'అమ్మఒడి' ఓ వరం



ప్రభుత్వం అందించే అమ్మ ఒడి పథకం ఉన్నత చదువుకు పెద్ద భరోసాగా నిలుస్తోంది. పేద కుటుంబాల నుంచి వచ్చిన మా లాంటి విద్యార్థులకు ఇది ఎంతో ఉపయోగం. మా అమ్మ చనిపోవడంతో మా నాన్న ఖాతాలోకి నగదు జమ చేస్తున్నారు. వరుసగా నాలుగో ఏడాది కూడా అమ్మఒడి డబ్బులు పడ్డాయి. పేద విద్యార్థులకు ఈ పథకం గొప్ప వరం. **– మంజునాథ్, విద్యార్థి ,కొత్తకోట, బుక్కపట్నం**

థ్యాంక్యూ జగన్ మామయ్య



మా ఇంటికి అమ్మఒడితో పాటు ఎన్నో పథకాలు అందజేస్తూ కుటుంబ అభివృద్ధికి జగన్ మావయ్య తోడ్పాటునందిస్తున్నారు. ఏ ఇబ్బంది లేకుండా బడికి వెళ్తున్నా. ప్రభుత్వ పథకాలు వచ్చిన ప్రతిసారి మా ఇంట్లో పండుగ వాతావరణం కనిపిస్తుంది. మాది పేద కుటుంబం కావడంతో డబ్బు వచ్చిన ప్రతిసారి సీఎంకు కృతజ్ఞతలు చెప్పుకుంటాం. **– శృతి, 10వ తరగతి విద్యార్థిని, పుట్టపర్తి**

పండుగలను ప్రశాంతంగా జరుపుకోండి

- ఎస్పీ మాధవరెడ్డి



మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి

హిందూపురం: జిల్లా ప్రజలందికీ బక్రీద్, ఏకాదశి పండుగ సందర్భంగా జిల్లా ఎస్పీ మాధవరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో పండుగలను సంతోషంగా జరుపుకోవాలని సూచించారు. ఎస్పీ మాధవరెడ్డి బుధవారం సాయంత్రం హిందూపురం వన్‌టౌన్ పట్టణ పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేశారు. బక్రీద్, ఏకాదశి పండుగలను పురస్కరించుకొని పట్టణ పరిధిలో ఎలాంటి అసాంఘిక సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పట్టణంలో ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. ముఖ్య ప్రాంతాలు, కూడళ్లలో విధులు నిర్వహించనున్న పోలీసు బందోబస్త్ సిబ్బందికి సూచన, సలహాలిచ్చారు. పోలీస్ సిబ్బంది పీస్ కమిటీ సభ్యులతో సమన్వయం చేసుకుంటూ ప్రశాంత వాతావరణంలో పండుగలు ముగిసేల చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హిందూపురం డీఎస్పీ కంజక్షన్, వన్‌టౌన్ సీఐ ఈరన్న, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తిరువణ్ణామలైకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

పుట్టపర్తి టౌన్ : తమిళనాడు రాష్ట్రంలోని తిరువన్నామలైలో వెలసిన అరుణాచలస్వామి దర్శనానికి వెళ్లే భక్తుల కోసం జిల్లాలోని అన్ని ఆర్టీసీ డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి మధుసూదన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 3వ తేదీ వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని స్వామి దర్శనంతో పాటు గిరి ప్రదర్శన చేసేందుకు వెళ్లే భక్తుల కోసం పుట్టపర్తి, ధర్మవరం, హిందూపురం, కదిరి, డిపోల నుంచి 6 ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. ఆయా డిపోల నుంచి జూలై 2వ తేదీ సాయంత్రం బయలుదేరే బస్సులు 3వ తేదీ ఉదయం అరుణాచలం చేరుకుంటాయన్నారు. 50 మంది అడ్వాన్స్ బుకింగ్ చేసుకుంటే అదనపు చార్జీలతో వారి గ్రామం నుంచే బస్సులు నడుపుతామన్నారు. పూర్తి వివరాలకు ఆయా ఆర్టీసీ డిపో మేనేజర్లను సంప్రదించాలని సూచించారు.

ఆషాఢ ఏకాదశి వేడుకలు ప్రారంభం



నృత్యరూపకాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థులు



దిండి పాదయాత్ర భక్తులకు స్వాగతం పలుకుతున్న సత్యసాయి ట్రస్ట్ సభ్యులు

ప్రశాంతి నిలయం: ప్రశాంతి నిలయంలో ఆషాఢ ఏకాదశి పర్వదిన వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వేడుకల సందర్భంగా సత్యసాయి మహాసమాధిని, సాయికుల్వంత్ సభా మందిరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. బుధవారం ఉదయం సత్యసాయి మహా సమాధి చెంత గోవా, మహారాష్ట్ర భక్తుల పాండు రంగ గాయత్రి, సాయి గాయత్రి పఠనంతో ప్రారంభమయ్యాయి. తర్వాత ఇరు రాష్ట్రాలకు చెందిన బాలవికాస్ విద్యార్థులు ఇంగ్లిష్, మరాఠీ, హిందీ భాషల్లో ఆషాఢ ఏకాదశి వేడుకల విశిష్టతను వివరించారు. సాయంత్రం మహారాష్ట్ర, గోవా భక్తులు వార్కరీ సాంప్రదాయ రీతిలో నృత్య ప్రదర్శన నిర్వహించారు. 'వసుంధరా సాయి ప్రేమ ధార'' పేరుతో ప్రదర్శించిన నృత్యరూపకం అందరినీ ఆకట్టుకుంది.

పుట్టపర్తికి చేరిన దిండి పర్తియాత్ర..

ఆషాఢ ఏకాదశి వేడుకలను పురస్కరించుకుని మహారాష్ట్ర, గోవా సత్యసాయి భక్తులు మహారాష్ట్రంలోని దిండి నుంచి ప్రారంభించిన పర్తియాత్ర బుధవారం పుట్టపర్తికి చేరుకుంది. ఈ సందర్భంగా ప్రశాంతి నిలయంలో సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్ రాజు, సత్యసాయి సేవా సంస్థల ఆల్ ఇండియా ఉపాధ్యక్షుడు నిమిష్ పాండే తదితరులు వారికి ఘన స్వాగతం పలికారు.

డ్రగ్స్‌కు చెక్‌పెట్టేలా చర్యలు

- కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి



సమీక్ష సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి అర్బన్: ప్రశాంతతకు మారుపేరైన శ్రీ సత్యసాయి జిల్లాలో డ్రగ్స్‌ను సమూలంగా రూపుమాపేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో మాదక ద్రవ్యాల నివారణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ జిల్లాలో డ్రగ్స్ సంస్కృతి ఇప్పుడిప్పుడే మొదలవుతోందని, ఇది వ్యాప్తి చెందకుండా ఆదిలోనే చెక్ పెట్టాలన్నారు. కదిరితో పాటు జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో అధికంగా డ్రగ్స్ కేసులు నమోదవుతున్నాయన్నారు. ఆయా ప్రాంతాల్లో డ్రగ్స్‌పై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సరిహద్దు ప్రాంతాలు, పరిశ్రమల ప్రాంతాల్లో నాకా బందీ నిర్వహించాలన్నారు. డ్రగ్స్ మూలాలు ఎక్కడ ఉన్నాయో కనిపెట్టి వాటిని సమూలంగా తొలగించాలని ఆదేశించారు. ఇప్పటి వరకూ డ్రగ్స్ రహిత చర్యలు మంచి ఫలితాలు ఇస్తున్నాయని ఎస్పీని, సిబ్బందిని కలెక్టర్ కొనియాడారు. ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ డ్రగ్స్‌కు అడ్డుకట్ట వేసేలా రైల్వే స్టేషన్లు, ఇతర ప్రాంతాల్లో నిఘాను పెంచామన్నారు. డ్రగ్స్ మూలాలు వైజాగ్‌లోని ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్నాయన్నారు. అక్కడ నుంచి వస్తున్న చైన్ సప్లయ్, పాఠశాలలు, కళాశాలల పైనా దృష్టిసారిస్తున్నట్లు వెల్లడించారు. రైల్వే సిబ్బంది అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. డ్రగ్స్ నివారణకు విరివిగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, అడిషనల్ ఎస్పీ విష్ణు, ఆర్డీఓలు భాగ్యరేఖ, తిప్పేనాయక్, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

• కృష్ణం వందేజగద్గురుం



స్వామివార్లకు హారతి ఇస్తున్న దృశ్యం

హిందూపురం: పట్టణంలో బుధవారం నిర్వహించిన జగన్నాథ రథయాత్ర అత్యంత వైభవంగా సాగింది. ముద్దిరెడ్డిపల్లి నుంచి టీటీడీ కళ్యాణ మండపం వరకు సాగిన యాత్రలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ముందుగా ముద్దిరెడ్డిపల్లిలోని నందిసర్కిల్ ఆంజనేయస్వామి వద్ద కొలువుదీర్చిన రుక్మిణి, బలరామ, శ్రీకృష్ణ విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీకృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో హిందూపురం మొదటిసారిగా భక్తివేదాంతస్వామి శ్రీప్రభుపాదల జగన్నాథ రథయాత్ర కార్యక్రమం జరిగింది. మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్‌చైర్మన్ బలరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, టీడీపీ నాయకులు అంబికా లక్ష్మీనారాయణ తదితరులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేదాంత స్వామి మాట్లాడుతూ భక్తిభావంతో మెలిగితే సమాజం ప్రశాంతంగా ఉంటుందన్నారు. జగన్నాథ రథయాత్ర ముద్దిరెడ్డిపల్లి, మేళాపురం, పెనుకొండ రోడ్డు, అంబేడ్కర్ సర్కిల్, విడిరోడ్డు, రైల్వేరోడ్డు గుండా నందిసర్కిల్ వరకు సాగింది.



జగన్నాథ రథయాత్రలో పాల్గొన్న భక్తులు

• నేడు బక్రీద్ పర్వదినం

సామూహిక ప్రార్థనలకు ఏర్పాట్లు పూర్తి



హిందూపురంలో ముస్తాబైన ఆర్‌పీజీటీ రోడ్డులోని ఈద్గా మైదానం

త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పర్వదినానికి జిల్లాలోని ఈద్గా మైదానాలు, మసీదులు ముస్తాబయ్యాయి. గురువారం ఉదయం నుంచే ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు. రంజాన్ తరువాత అత్యంత పవిత్రంగా భావించే పండుగల్లో బక్రీద్ ఒకటి. త్యాగానికి నిదర్శంగా భావించే ఈ పండుగను పురస్కరించుకొని హిందూపురం, కదిరి, పుట్టపర్తి, పెనుకొండ, మడకశిర ప్రాంతాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. – సాక్షి బృందం

అందరికీ మంచి జరగాలి



కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: జిల్లాలోని ముస్లిం సోదరులకు కలెక్టర్ అరుణ్‌బాబు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఇందులో భాగంగానే బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. జిల్లాలోని ప్రతి ఒక్కరిపై అల్లాహ్ దయ ఉండాలని, అందరికీ మంచి జరగాలని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు.

'జగనన్న సురక్ష'ను విజయవంతం చేయండి

పుట్టపర్తి అర్బన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్ని జిల్లాల కలెక్టర్లను ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్య ఆదేశించారు. బుధవారం విజయవాడ నుంచి జగనన్న సురక్ష కార్యక్రమం అమలుపై సీఎంఓ కార్యాలయ అదనపు కార్యదర్శి భరత్ గుప్తా, సీఎం ముఖ్య కార్యదర్శి రేవు ముత్యాలరాజుతో కలిసి పూనం మాలకొండయ్య వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పుట్టపర్తి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ అరుణ్‌బాబు, సబ్ కలెక్టర్ కార్తీక్, డీఆర్‌ఓ కొండయ్య తదితరులు పాల్గొన్నారు. పూనం మాలకొండయ్య మాట్లాడుతూ జగనన్న సురక్షలో భాగంగా వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి సమస్యలను తెలుసుకొని పరిష్కారం చూపించాలన్నారు. జూలై 1 నుంచి జగనన్న సురక్ష క్యాంపులు నిర్వహించడానికి మండలస్థాయి అధికారులు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ఎలాంటి సాంకేతిక లోటుపాట్లు లేకుండా చూసుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మధులత, భవాని శంకరి, హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురికి ప్రొఫెసర్లుగా పదోన్నతి



అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ఆరుగురు అసోసియేట్ ప్రొఫెసర్లకు ప్రొఫెసర్లుగా పదోన్నతి కల్పించారు. ఈ మేరకు బుధవారం ఎస్కేయూ వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన పాలకమండలి సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. పదోన్నతి పొందిన వారిలో ఫిజిక్స్ విభాగం డాక్టర్ ఎం. రాంగోపాల్, కంప్యూటర్ సైన్సెస్ విభాగం డాక్టర్ వి.రఘునాథరెడ్డి, తెలుగు విభాగం డాక్టర్ ఎస్.ఆర్.సదాశివారెడ్డి, ఫిజికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ ఎంవీ శ్రీనివాసన్, బయోటెక్నాలజీ విభాగం డాక్టర్ డి.మురళీధర్‌రావు, అనిత ఉన్నారు. అలాగే జూలై 17న నిర్వహించే స్నాతకోత్సవానికి సంబంధించి ముగ్గురికి డాక్టరేట్ ప్రదానం చేసే అంశానికి పాలక మండలి ఆమోదం తెలిపింది. వీరిలో ఒకరిని గవర్నర్ ఎంపిక చేయనున్నారు. పాలకమండలి సమావేశం ముగిసిన అనంతరం ఆరుగురు అసోసియేట్‌లకు ప్రొఫెసర్లుగా ఉత్తర్వులు అందజేశారు.

క్లుప్తంగా

కుక్కల దాడిలో జాతీయ పక్షి మృతి



పెనుకొండ: కుక్కల దాడిలో జాతీయ పక్షి (నెమలి) మృత్యువాత పడింది. సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి బుధవారం ఉదయం పెనుకొండ ప్రధాన రహదారిపైకి చేరుకున్న నెమలి ఓ గోడపై వాలింది. అదే సమయంలో రోడ్డుపై ఆహారం కనిపించడంతో నేలపైకి వాలింది. దీంతో అక్కడే ఉన్న కుక్కలు ఒక్కసారిగా నెమలిని చుట్టుముట్టాయి. స్థానికులు అప్రమత్తమై కుక్కల బారి నుంచి నెమలిని కాపాడేలోపు మృతి చెందింది. విషయం తెలుసుకున్న అటవీ శాఖ అధికారులు అక్కడకు చేరుకుని మరణించిన నెమలిని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం అనంతరం దహనం చేశారు.

పండ్ల తోటల పెంపకంపై అవగాహన



మాట్లాడుతున్న జిల్లా ఉద్యాన అధికారి హేమలత

అమరాపురం: స్థానిక వైకేపీ కార్యాలయంలో ఏపీఓ గోపాల్ ఆధ్వర్యంలో బుధవారం ఉపాధి హామీ సిబ్బంది, రైతులకు పండ్ల తోటల పెంపకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. మండలంలో మెట్ట భూములు, బోరు బావుల కింద పండ్ల తోటల పెంపకంపై రైతులకు జిల్లా ఉద్యాన అధికారి హేమలత అవగాహన కల్పించారు. చిన్న, సన్న కారు రైతులు పండ్ల తోటలను పెంపకం చేపడితే గుంతలు తీయడానికి, మొక్కలు పెట్టడానికి, ఎరువులకు, నీటికి ప్రభుత్వం డబ్బు చెల్లిస్తుందన్నారు. పండ్ల తోటల పెంపకంతో శ్రమ తక్కువ ఆదాయం ఎక్కువగా ఉంటుందని వివరించారు. మండలంలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీడీలు లక్ష్మీనారాయణ, జయసింహా, ఏపీఓ హెన్రీ తదితరులు పాల్గొన్నారు.

పరుగుల రాణి ప్రత్యూష

దాదాపు ఏడెనిమిదేళ్ల క్రితం గ్రామీణ రహదారిపై ఆమె పరుగు తీస్తుంటే అందరూ ఆశ్చర్యంగా చూసేవారు. ఆమె ఎటు వైపు వెళితే అటుగా తమ దృష్టి సారించేవారు. కొందరైతే ఆడపిల్లకు ఈ పరుగులు అవసరమా? అని బుగ్గలు నొక్కుకునేవారు. అయినా ఆమె వెనుకంజ వేయలేదు. తర్వాతి రోజుల్లో జిల్లా అథ్లెటిక్స్‌కు ఆమె కొత్తదారి చూపించింది. ఎవరూ ఊహించని రీతిలో చిరస్మరణీయ ఘనతలు సొంతం చేసుకుంది. కృషి, పట్టుదలతో తాను అనుకున్నది సాధించిన ఆమెనే ప్రత్యూష. అథ్లెటిక్స్‌లో రాణిస్తూ గ్రామీణ ప్రాంతం నుంచి చైనాలో జరిగే అంతర్జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించిన ప్రత్యూష క్రీడా ప్రస్థానంపై 'సాక్షి' ప్రత్యేక కథనం.





జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో బంగారు పతకాన్ని అందుకుంటున్న దృశ్యం (ఫైల్)

- అథ్లెటిక్స్ పోటీల్లో రాణిస్తున్న గ్రామీణ విద్యార్థిని
- ఈ ఏడాది అంతర్జాతీయ పోటీలకు ఎంపిక

ముదిగుబ్బ: ధర్మవరం నియోజకవర్గ పరిధిలోని ముదిగుబ్బ ఎస్‌డీఆర్‌ఆర్ డిగ్రీ కళాశాలలో మూడో సంవత్సరం బీకాం కంప్యూటర్స్ చదువుతున్న చెలిమి ప్రత్యూష అంతర్జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైంది. ఈ ఏడాది జూలై 28 నుంచి ఆగస్టు 5వ తేదీ వరకూ చైనాలోని చెంగుడులో జరిగే అంతర్జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో భారతదేశం తరఫున పరుగు పోటీల్లో ఆమె పాల్గొననుంది.

తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే..

పుట్టపర్తి నియోజకవర్గంలోని బుక్కపట్నం మండలం పాముదుర్తి గ్రామానికి చెందిన చెలిమి మోహన్, లక్ష్మీదేవి దంపతులకు ఇద్దరు కుమార్తెలు. వీరిలో ప్రత్యూష పెద్ద కుమార్తె. చేనేత కార్మికులుగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవారు. కుమార్తెలను వారు ఏనాడు ఆడపిల్లగా చూడలేదు. మగపిల్లలతో సమానంగా వారికి అన్ని అవకాశాలు కల్పిస్తూ వచ్చారు. 1వ తరగతి నుంచి పదో తరగతి వరకు పాముదుర్తి ప్రభుత్వ పాఠశాలలోనే ప్రత్యూష చదువుకుంది. ఏడో తరగతిలో ఉన్నప్పుడు నిర్వహించిన పాఠశాల స్థాయి ఆటపోటీల్లో ప్రతిభ కనబరిచిన ప్రత్యూషలోని అథ్లెట్‌ను గుర్తించిన పీఈటీ ప్రకాష్‌రెడ్డి ఆమెను వెన్ను తట్టి ప్రోత్సహిస్తూ వచ్చారు. పీఈటీ పర్యవేక్షణలో ఆమె పరుగు, లాంగ్ జంప్‌లో రాటు దేలింది. అనంతరం తల్లిదండ్రులు ప్రోత్సహించడంతో కోచ్‌లు రమేష్, సురేష్ వద్ద ప్రత్యేక శిక్షణ పొందిన ప్రత్యూష.. పరుగుల రాణిగా ఖ్యాతిగడించింది.

పోటీలకు వెళితే పతకాలే..

పాఠశాల విద్యార్థిగా ఉన్నప్పటి నుంచి ఇప్పటి వరకూ ప్రత్యూష ఏ పోటీకి వెళ్లినా.. పతకంతో తిరిగి వస్తోంది. తొలిసారిగా పదో తరగతి విద్యార్థిగా ఉన్నప్పుడు కర్నూలులో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు అనంతపురం జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించి, బంగారు పతకం సాధించింది. ఇంటర్మీడియట్ చదువుతున్నప్పుడు గుజరాత్‌లోని వడోదరలో నిర్వహించిన జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ఏపీ తరఫున పాల్గొని లాంగ్ జంప్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. అనంతరం రాజమండ్రిలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని వంద మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. ఇప్పటి వరకూ రాష్ట్ర స్థాయిలో 29, జాతీయ స్థాయిలో 5 పతకాలు ఆమె సొంతమయ్యాయి.

జాతీయ స్థాయిలో ఇలా..

- 2016లో గుజరాత్‌లో నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని లాంగ్‌జంప్ విభాగంలో 4వ స్థానంలో నిలిచింది.
- 2018లో గుంటూరులో నిర్వహించిన జూనియర్ నేషనల్ లెవల్ లాంగ్‌జంప్, వంద మీటర్ల పరుగు పోటీల్లో పాల్గొని బంగారు పతకాలు దక్కించుకుంది.
- 2019లో ఛత్తీస్‌ఘఢ్‌లో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని లాంగ్ జంప్ విభాగంలో వెండి పతకాన్ని కైవసం చేసుకుంది.
- 2022లో గుంటూరు వేదికగా జరిగిన సౌత్ జోన్ పోటీల్లో పాల్గొని వంద మీటర్ల పరుగు విభాగంలో వెండి, లాంగ్‌జంప్‌లో బంగారు పతకాలను దక్కించుకుంది.
- ఈ నెల 14, 15 తేదీల్లో భువనేశ్వర్‌లోని కిట్ యూనివర్సిటీ వేదికగా జరిగిన అంతర్జాతీయ పోటీల ఎంపికలో ప్రతిభ చాటుకుంది. 200 మీటర్ల పరుగులో నిర్ణీత 25.10 నిమిషాల్లో 200 మీటర్ల పరుగు పూర్తి చేయాల్సి ఉండగా 24.29 నిమిషాల్లోనే అధిగమించి మొదటి స్థానంలో నిలిచి, చైనాలో జరిగే అథ్లెటిక్స్ పోటీలకు భారత దేశం తరఫున పాల్గొనే అరుదైన అవకాశాన్ని సొంతం చేసుకుంది. అలాగే భువనేశ్వర్‌లోని కళింగ స్టేడియంలో నేషనల్ ఇంటర్ స్టేట్ సీనియర్ అథ్లెటిక్స్–23 చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొని రిలే పరుగులో వెండి పతకాన్ని కైవసం చేసుకుంది.



తల్లిదండ్రులు, చెల్లెలు శిరీషతో...



సాధించిన పతకాన్ని చూపుతున్న ప్రత్యూష

12 సార్లు ప్లేట్‌లెట్ల దానం



ప్లేట్‌లెట్లను దానం చేస్తున్న వెంకటేష్

ధర్మవరం అర్బన్: పట్టణంలోని రక్తబంధం ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు కన్నా వెంకటేష్ ఇప్పటికే 20సార్లు రక్తదానంతో పాటు 12సార్లు ప్లేట్‌లెట్లను దానం చేసి అందరిచేత ప్రశంసలు అందుకుంటున్నారు. అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగికి ప్లేట్‌లెట్లు అవసరం కావడంతో సమాచారం అందుకున్న వెంకటేష్ బుధవారం అనంతపురానికి వెళ్లి ప్లేట్‌లెట్‌లను దానం చేసి వచ్చారు. విషయం తెలుసుకున్న ధర్మవరం వాసులు వెంకటేష్‌ను అభినందించారు.

'జగనన్న సురక్ష' ఓ వరం

- చిట్టచివరి లబ్ధిదారుడికీ న్యాయం చేకూరుతుంది
- దేశ చరిత్రలోనే కొత్త అధ్యాయం
- మడకశిర ఎమ్మెల్యే తిప్పేస్వామి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర: జగనన్న సురక్ష కార్యక్రమం ప్రజలకు ఓ వరం లాంటిదని మడకశిర ఎమ్మెల్యే తిప్పేస్వామి అన్నారు. చిట్టచివరి లబ్దిదారుడికీ న్యాయం చేకూర్చమడే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిప్రవేశపెట్టిన ఈ కార్యక్రమం దేశ చరిత్రలోనే కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టిందని కొనియాడారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేపట్టని విధంగా విప్లవాత్మక సంస్కరణలతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లోనూ సీఎం వైఎస్ జగన్ అభివృద్ధి పథం నడిపిస్తున్నారన్నారు. ఏ ముఖ్యమంత్రి కూడా ఇప్పటి వరకూ అధికార యంత్రాంగాన్ని ప్రజల ముంగిటకు పంపి సమస్యలపై ఆరా తీయించిన దాఖలాలు లేవన్నారు. తొలిసారిగా సీఎం వైఎస్ జగన్ ఇలాంటి కార్యక్రమాన్ని చేపట్టి ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం చూపే దిశగా చర్యలు తీసుకోవడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోందన్నారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సమావేశంలో బోయ కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ ఓబిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రామిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, వైస్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మమ్మ, ఎంపీపీ కవిత, జెడ్పీటీసీ సరోజమ్మ, వైస్ఎంపీపీ నరసింహమూర్తి, మాజీ ఎంపీపీ బజ్జప్ప, స్థానిక నాయకులు సత్యనారాయణరెడ్డి, జమ్మానిపల్లిమూర్తి, అంజలి, నాగభూషణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జేసీపీఆర్ దిష్టిబొమ్మ దహనం కేసు కొట్టివేత

హిందూపురం: టీడీపీ మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకరరెడ్డి దిష్టిబొమ్మ దహనం కేసును హిందూపురంలోని అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ (ఏజేఎఫ్‌సీఎం) న్యాయస్థానం కొట్టివేసింది. ప్రతివాదుల తరఫు న్యాయవాది వెంకటరెడ్డి తెలిపిన మేరకు.. 2017, మార్చిలో అనంతపురంలోని 'సాక్షి' దిన పత్రిక ప్రధాన కార్యాలయం ఎదుట తన కుమారుడు అస్మిత్ రెడ్డితో కలసి అప్పటి తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ ప్రభాకరరెడ్డి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా అప్పటి ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని దుర్భాషలాడడంతో హిందూపురంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నిరసన వ్యక్తం చేస్తూ జేసీ ప్రభాకరరెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఘటనకు సంబంధించి వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రశాంత్‌గౌడ్, ఫజులుల్ రహమన్, ఇర్షాద్ అహమ్మద్; కె.వేణుగోపాలరెడ్డి, సమద్, రహమాన్, ఆసీఫుల్లా, వెంకటేశ్వరరెడ్డి, రాము, షమీమ్‌తాజ్, నాగమణి, బసిరెడ్డి, పురుషోత్తంరెడ్డి, అమర్‌నాథ్, మదన్‌గోపాలరెడ్డి, రామకృష్ణరెడ్డి తదితర 19మందిపై అప్పటి తహసీల్దార్ చల్లా విశ్వనాథ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి ఈ కేసు వాదనలు జరుగుతూ వచ్చాయి. నేరం రుజువు కాకపోవడంతో కేసు కొట్టి వేస్తూ బుధవారం ఏజేఎఫ్‌సీఎం భాగ్యలక్ష్మి తీర్పు వెలువరించారు.

ఆర్థిక అక్షరాస్యతపై విద్యార్థులకు క్విజ్ పోటీలు



ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఎల్‌డీఎం రమణకుమార్

ప్రశాంతి నిలయం: జీ–20 సదస్సులో భాగంగా ఆర్థిక అక్షరాస్యతను పెంపొందించే దిశగా పుట్టపర్తిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జిల్లా స్థాయి పోటీలు ఏర్పాటు చేసినట్లు లీడ్ బ్యాంక్ మేనేజర్ ఏవీ రమణకుమార్ తెలిపారు. పోటీల్లో ప్రతిభ చాటుకున్న విద్యార్థులను అభినందిస్తూ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. జిల్లాలోని 25 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పోటీలకు హాజరుకాగా, తలుపులలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు సుశాంత్‌రెడ్డి, శ్రీనాథ్ మొదటి స్థానంలో నిలిచారని, ,ధర్మవరం మున్సిపల్ పాఠశాలకు చెందిన జాన్‌మోసీ, వంశిక రెండో స్థానం, బత్తలపల్లి జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన మదీనా, ఆఫ్రీద్ సుహాన్ మూడో స్థానంలో నిలిచారని తెలిపారు. మొదటి స్థానంలో నిలిచిన వారికి రూ.10వేలు, రెండో స్థానంలో నిలిచిన వారికి రూ.7,500, మూడో స్థానంలో నిలిచిన వారికి రూ.5 వేలు చొప్పున పారితోషకాన్ని మూడు రోజుల్లోపు విద్యార్థుల బ్యాంక్ ఖాతాలకు జమ చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులను జూలై 14న విశాఖపట్నంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. అనంతరం విజేతలకు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోక్సో కేసు నమోదు

తాడిపత్రి అర్బన్: ఇంటర్ చదువుతున్న దళిత బాలికను పెళ్లి చేసుకుంటానని నమ్మించి గర్భవతిని చేసిన వ్యక్తిపై తాడిపత్రి పట్టణ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ ధరణీబాబు తెలిపిన వివరాల మేరకు...వైఎస్సార్ జిల్లా కాశీనాయన మండలం నరసాపురంలోని ఏపీ మోడల్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఓ బాలిక(17) తాడిపత్రి పట్టణంలోని తన పిన్నీ ఇంటిలో ఉండేది. కర్నూలు జిల్లా కొలిమిగుండ్లకు చెందిన బంధువు ఒకరు తన ఇంట్లో జరుగుతున్న శుభకార్యానికి బాలికను తీసుకువచ్చేందుకు ఆరు నెలల క్రితం కారులో హాస్టల్‌కు వెళ్లాడు. బాలికను తీసుకుని తాడిపత్రిలోని ఆమె పిన్ని ఇంటికి తీసుకువచ్చాడు. ఈ క్రమంలో కారు డ్రైవర్ అఫీజ్, బాలిక మధ్య పరిచయం ఏర్పడింది. ఈ పరిచయాన్ని అడ్డుగా పెట్టుకుని అఫీజ్ బాలికకు మాయమాటలు చెప్పాడు. వివాహం చేసుకుంటానని నమ్మించి లైంగిక దాడికి పాల్పడ్డాడు. దీంతో బాలిక గర్భం దాల్చింది. ఇదే విషయాన్ని అతనికి చెప్పి పెళ్లి చేసుకోవాలని కోరింది. అయితే అఫీజ్ సాకులు చెబుతూ మోహం చాటేస్తుండటంతో బాలిక బుధవారం పట్టణ పోలీసులను ఆశ్రయించింది. దీంతో పోలీసులు బాలిక ఫిర్యాదు మేరకు పోక్సో యాక్టు కింద కేసు నమోదు చేశారు. నిందితుడు అఫీజ్‌ను అదుపులోకి తీసుకున్నారు.

వలస కార్మికుడి దుర్మరణం

హిందూపురం అర్బన్: బతుకు తెరువు కోసం కుటుంబంతో కలసి వలస వచ్చిన ఓ కార్మికుడు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... ఉత్తరప్రదేశ్‌కు చెందిన రాజ్‌కుమార్ (33)కు భార్య, ముగ్గురు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. ఏడేళ్ల క్రితం బతుకు తెరువు కోసం కుటుంబంతో సహ హిందూపురానికి వలస వచ్చి సిరికల్చర్ కాలనీలో అద్దె ఇంట్లో నివాసముంటున్నాడు. స్థానిక పారిశ్రామిక వాడలోని ఓ కర్మాగారంలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. బుధవారం మధ్యాహ్నం విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరిన రాజ్‌కుమార్‌ను తూమకుంట చెక్ పోస్టు వద్ద వేగంగా దూసుకొచ్చిన లారీ ఢీకొంది. ఘటనలో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని రాజ్‌కుమార్ మృతదేహం పడి బోరున విలపించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ అబ్దుల్‌కలాం తెలిపారు.

యువకుడి మృతి



మృతుడు రామునాయక్

అనంతపురం శ్రీకంఠం సర్కిల్: నగర శివారులోని జాతీయ రహదారిపై చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.. శ్రీసత్యసాయి జిల్లా ముదిగుబ్బకు చెందిన రామునాయక్ (35).. అనంతపురంలోని ఆరో రోడ్డులో నివాసముంటున్న మల్లయ్య వద్ద లారీ క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా భార్యకు దూరంగా ఉంటున్న ఆయన బుధవారం రాత్రి 9.15 గంటలకు వ్యక్తిగత పనిపై రుద్రంపేట శివారులో 44వ జాతీయ రహదారి దాటుతుండగా వేగంగా దూసుకెళ్లిన వాహనం ఢీకొంది. ఘటనలో రామునాయక్ అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా ఉడాయించాడు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

పరిటాల శ్రీరామ్‌పై కేసు నమోదు

కనగానపల్లి: టీడీపీ నాయకుడు పరిటాల శ్రీరామ్‌పై కనగానపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.'భవిష్యత్తు గ్యారంటీ' పేరిట సోమవారం పరిటాల సునీత ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు రాప్తాడు నుంచి పేరూరు వరకూ బస్సు యాత్ర చేపట్టిన విషయం తెల్సిందే. ఈ సందర్భంలో మండలంలోని రాంపురం గ్రామం వద్ద పరిటాల శ్రీరామ్‌తో పాటు అతని అనుచరులు తమపై ఘర్షణకు దిగి, నానా దుర్భాషలాడరని వైఎస్సార్‌సీపీ కార్యకర్త వడ్డే రాఘవేంద్ర మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఫిర్యాదు చేపట్టి పరిటాల శ్రీరామ్, అతని అనుచరులు తూంచర్ల హరి, కుర్లపల్లి చంద్రా, రాజుపై ఐపీసీ 341, 506, 509 సెక్షన్లు కింద కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ హనుమంతరెడ్డి తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య



మృతదేహాన్ని వెలికి తీస్తున్న పోలీసులు

పుట్టపర్తి టౌన్: జీవితంపై విరక్తితో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. బుక్కపట్నం నివాసి శ్రీనివాసరావు (55) కొన్నేళ్లుగా పుట్టపర్తిలో టీవీ మెకానిక్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇటీవల అనారోగ్యం బారిన పడిన ఆయన జీవితంపై విరక్తి పెంచుకుని మంగళవారం సాయంత్రం చిత్రావతి నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. చీకటి పడినా ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఆందోళనకు గురయ్యారు. చుట్టపక్కల వెదికినా ఆచూకీ లభ్యం కాలేదు. బుధవారం ఉదయం చిత్రావతి నది ఒడ్డున మృతదేహం తేలడంతో స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. విషయం తెలుసుకున్న శ్రీనివాసరావు కుమారుడు, కుమార్తె సైతం అక్కడకు చేరుకుని పరిశీలించి, మృతదేహం తమ తండ్రిదేనని ధ్రువీకరించి బోరున విలపించారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు సీఐ బాలసుబ్రహ్మణ్యం తెలిపారు.

చికిత్స పొందుతూ మృతి



నవీన్ (ఫైల్)

నార్పల: ఆత్మహత్యాయత్నం చేసిన ఓ బాలుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... నార్పలకు చెందిన చిలమకూరి గోపాల్ కుమారుడు నవీన్ (16) ఇటీవల పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు రాశాడు. ఐదు రోజుల క్రితం ఫలితాలు వెలువడ్డాయి. సప్లిమెంటరీ పరీక్షల్లోనూ ఫెయిల్ కావడంతో తీవ్ర మనస్తాపానికి లోనై క్రిమి సంహారక మందు తాగాడు. విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు వెంటనే అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. ఐదు రోజులుగా అక్కడే చికిత్స పొందుతున్న నవీన్ ఆరోగ్య పరిస్థితి విషమించి బుధవారం తెల్లవారుజామున మృతిచెందాడు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ రాజశేఖరరెడ్డి తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

ఫెయిల్ అయిన వారి కోసం

ఈ సంవత్సరం 10th క్లాస్ ఫెయిల్ / ఇంటర్ లో ఫెయిల్ అయిన స్టూడెంట్స్‌కి శుభవార్త ! మేము నిర్వహించబోయే 5 నెలల కోర్స్ ద్వారా పాస్ పొందండి. సంప్ర : 9030661651, అనంతపురము. [A-776747]

నవోదయ కోచింగ్

1st జూలై నుండి కొత్త బ్యాచ్ ప్రారంభం. బాల బాలికలకు హాస్టల్ వసతి కలదు. రూరల్ SC,ST విద్యార్థులకు ప్రత్యేక రాయితీ కలదు. అనంతపురం. సెల్ : 9182837914. [A-776754]

పాలిటెక్నిక్ అడ్మిషన్స్

A.P. పాలిసెట్‌లో క్వాలిఫై అయితే, పాలిటెక్నిక్ నందు ఫ్రీఎడ్యుకేషన్, క్వాలిఫై కాకపోతే ఓన్లీ హాస్టల్ ఫీజుతో చదువుకునే అవకాశం కలదు. సంప్ర : 6301604132, ధర్మవరం. [A-776745]

B.SC. NURSING

ఓన్లీ గర్ల్స్ కాలేజీలో Govt. సీట్స్ B.Sc. (నర్సింగ్), B.Sc. (MLT), BPT (ఫిజియోథెరపీ) నందు ఫ్రీ ఎడ్యుకేషన్, కాలేజీ లోనే హాస్టల్. Q: ఇంటర్. సంప్ర : జి. మురళీ, 9030661651, ATP. [A-924]

PARAMEDICAL

B.Sc Nursing,BPT& Paramedical Courses Available. DMLT, Anesthesia, Dialysis, Cardiology, Cathlab, Opthalmic. Any Inter Eligible, Tirupati, 7416478396, 7416478395. [T-1450]

ADMISSIONS

R.R. క్రిస్టియన్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్, కర్నూలు నందు B.Sc(N), PB BSC (N)/ GNM (స్టాఫ్ నర్స్) & MSRR కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపి కర్నూలు. (ఫిజియోథెరపి డాక్టర్) కోర్స్ కొరకు మేనేజిమెంట్ కోట సీట్లు కొరకు సంప్ర: 94402 89937 [L-799241]

ఉచిత శిక్షణ ఉపాధి

గ్రామీణ నిరుద్యోగ యువతకు 4 నెలల కాల వ్యవధిలో కంప్యూటర్ హార్డ్వేర్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, కోర్సులలో ఉచిత శిక్షణ, భోజన వసతి సదుపాయం, అర్హతను బట్టి ఉపాధి అవకాశాలు కల్పించబడును. Nihar skill Education,కడప. సంప్ర: 9063082227. [C-785822]

ONE SITTING

ONE SITTING : 10th, 12th B.A., B.Com., B.Sc., M.A., M.Com., M.Sc., B.Ed., BBA, BCA, MBA, MCA, Nursing, Pharmacy, Dip. in VET, B.Tech., from Regd., University in India. (for Discont.,) Exam in July - ✆ : 73383 76874 [R-27]

REAL ESTATE

విల్లాస్ - బాడుగకు

TOLET : ఆహ్లాదకరమైన వాతావరణంలో నిర్మించబడిన ప్రముఖ రేణుక గేటెడ్ కమ్యూనిటీ నందు అన్ని వసతులతో, కొన్ని విల్లాస్‌లు ఖాళీగా ఉన్నవి. సంప్ర : 9000856501, ATP. [A-776748]

SERVICES

CHANGE OF NAME

I, NAZIA HUSSAIN. N (Old Name) has changed my name as SHAIK NAZIA W/o SHAIK IMRAN BABA , R/o COMFORT SPRINGS APARTMENT, 3rd Floor Flat No.304, Sri Nagar Colony, Near New Ambedkar Fundtion Hall, Anantapur (T&D) A. P. Henceforth my name known as SHAIK NAZIA for all purpose. [A-925]

Please take Notice that I, SHAIK MUKTHIYAR AHAMED, Aged 43 Years (New Name) Son of SHAIK SHAIKSHA VALI, Residing at D.No: 1-321, H.L.C. Colony, Anantapuramu City & District - 515004, A.P do hereby renounce my old name S.MUKTIARAHAMED, and adopt new name SHAIK MUKTHIYAR AHAMED and here after I may be called with my new name SHAIK MUKTHIYAR AHAMED only for all correspondence. [A-921]

Please take Notice that I, SHAIK MAHABOOB BEE, Aged 46 Years (New Name) Wife of SHAIK MUKTHIYAR AHAMED, Residing at D.No: 1-321, H.L.C. Colony, Anantapuramu City & District - 515004, A.P do hereby renounce my old name K. MAHABOOBI, and adopt new name SHAIK MAHABOOB BEE and here after I may be called with my new name SHAIK MAHABOOB BEE only for all correspondence. [A-922]

లింక్ డాక్యుమెంట్ పోయినది

పూజారి లక్ష్మణ్ణ తండ్రి లేట్ పి. నన్నప్ప, డి.నెం. 15-2-228/1, ఓబుళాచారి రోడ్డు, రాయదుర్గం, అనంతపురము జిల్లాకు చెందిన, రిజిస్టర్ డాక్యుమెంట్ నెం.2557/2011 షెడ్యూల్ ఆస్తి డోర్ నెం.15-2-228/1 గా గల ఇల్లు అసైన్మెంట్ నెం. 1006005727 ఈ ఆస్తికి సంబంధించి లింక్ డాక్యుమెంట్ 668/1988 పోయినది. ఇందుకు సంబంధించిన నకలు కాపీని రిజిస్టర్ ఆఫీస్ ద్వారా పొందియున్నాము. ఎవరికైనా దొరికిన యెడల / అభ్యంతరాలు ఉన్న యెడల సంప్ర : 9441951065. [A-776760]

వధువు కావలెను

రెడ్డి / 28 సం॥ / B.Tech./ పొలం + లారీ ట్రాన్స్ పోర్ట్ గల కడప అబ్బాయికి తగిన, అందమైన, మంచి కుటుంబానికి చెందిన రెడ్డి వధువు కావలెను. డైరెక్ట్ : 9676719135. [A-776759]

ASTROLOGY

అనంతపురము జిల్లా ప్రజలకు, రైతుమిత్రులకు తొలి ఏకాదశి శుభాకాంక్షలు. శ్రీ కృష్ణ జ్యోతిష్యాలయం, రూమ్ నెం.301, దేవాంగ భవన్, 1వ రోడ్డు, ATP. 9908626148. [A-776758]

శ్రీ గాయత్రీదేవి జ్యోతిష్యాలయం

ఉచితంగా జ్యోతిష్యం చెప్పబడును. పండింట్ S.V. శాస్త్రి గారు గత 70 సం॥లుగా అనంతపురంలో స్థిరపడి ఉంటున్నారు. స్త్రీ, పురుషులకు ఎటువంటి సమస్యకైనా గాయత్రి దేవి పూజ చేసి 7 రోజుల్లో శాశ్వత పరిష్కారం చూపబడును. సెల్: 7676703640. [A-7569]

BUSINESS OFFER

ద్వారకా ఎంటర్‌ప్రైజెస్: పేపర్ ప్లేట్స్ & LED మెషిన్స్ పై ప్రతి నెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు ఒప్పందం. ఫోన్:9310515624, 8800496710. [DA-37247]

WANTED

కనగానపల్లి మండలం, ముక్తాపురం గ్రామం దగ్గర వ్యవసాయం పనులు చేయుటకు తోటమాలి కావలెను. సంప్ర॥ సెల్ : 9701637389, 8328521391. [A-923]

హాస్టల్ వార్డెన్లు వంట మనుషులు, హాస్టల్ ట్యూటర్స్, వాచ్‌మెన్, Maths టీచర్లు అర్జెంటుగా కావలెను. సెల్ : 9491986783, అనంతపురం. [A-776753]

Job Vacancy. TIK PVT LTD. Age:18 to 45 Yrs, Qul: 10th to Any Degree, Salary: 18,000 to 25,000/- Contact Cell: 7207833091. [T-1674]

మా యొక్క ప్రముఖ సంస్థకు మొబైల్ ద్వారా సమాచారం పంపుతూ అధిక ఆదాయం సంపాదించుకోండి. మీ అడ్రస్ వాట్సాప్ చేయండి. వివరాలకు కాల్ చేయండి. 95736 33520, 90596 33520. [M-1221323]

Paparao High School, K.Uppalapadu, Prakasam Dist. Wanted Experienced Teachers for High school English, Primary School, Data Entry Op., Office Staff & Clerks. Salary negotiable. Free Food & Accommodation. Call: 7019326579/ 8008622210 - Principal. [HA-03171]

అనంతపురం నగరంలోని, ప్రముఖ పాలిటెక్నిక్ కాలేజ్‌లో పనిచేయుటకు B.Tech / M.Tech / M.Sc. మ్యాథ్స్ చదివిన, మంచి అనుభవం కల్గిన అధ్యాపకులు కావలెను. సంప్ర : 8888621124, 8888621125, 8888621128. [A-776755]

టీచర్స్ కావలెను : 1 నుండి 5వ తరగతి వరకు బోధించుటకు అన్ని సబ్జెక్టులకు టీచర్స్ కావలెను. # రూట్స్ పబ్లిక్ స్కూల్, రాచానపల్లి, GNR వనం, బళ్లారి రోడ్డు, ATP. సెల్ : 9908433610, 9000575759. [A-776756]

UC Info Tech సంస్థ నందు (15,000/- to 20,000/-) పనిచేయుటకు (వ : 18 to 28 లోపు, Un Married) యువతీ, యువకులు (10th, ఇంటర్, ITI, Dip, PG) ఉచిత వసతి. ఫోన్: 77996 54777, 93905 28568 [V-2852]

ప్రముఖ బ్యాంకుల యందు కాంట్రాక్టు/ ఔట్ సోర్స్‌లో వర్క్ చేయడానికి ఫిమేల్ స్టాఫ్ అ॥కా॥ ను. జీ: 15k-34k. ఇంట్రెస్ట్ ఉన్నవారు డిటేల్స్ వాట్సాప్ చేయండి. ఫోన్ : 6281159171 [HA-29751]

విజయవాడ, గాయత్రినగర్‌లోని SVVC మా సంస్థ కొరకు అనంతపురం జిల్లాలో పని చేయుటకు మండలాల వారీగా 50 సం॥ లోపు వయస్సు గల లేడీస్ & జెంట్స్ కావలెను. 93477 79584. [NA-10343]

త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను, ఫ్రీ వసతి+భోజనం, జీ: 18K ఏజెంట్ కమీషన్ 3K ఫోన్: 9848571888 [H-189301]

Wanted Exp, Qua Regular Physics -1 post (30k pm), IIT Chemistry -1 post (32k pm) with free food & accom. Contact: 9490551116 9319979999 St.Antonys High School, Porumamilla, YSR Kadapa (District). [C-1161050]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.